


ఆలీబాబు.. అరడజను అబద్ధాలు

సూపర్ సిక్స్ అంటూ చంద్రబాబు ప్రజలను మళ్లీ నిలువునా మోసం చేశారు. గతంలో 2014వ సంవత్సరంలో ఎన్నికల సమయంలో ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయకుండా మొహం చాటేసిన చంద్రబాబు అండ్‌కో మరోసారి అదే విధానాన్ని అనుసరిస్తున్నారని ప్రజలకు ఇప్పటికే అర్థమైపోయింది. అధికారం చేపట్టి ఇన్ని రోజులైనా తాము ఎన్నికల సమయంలో సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తామంటూ ప్రజలకు ఇచ్చిన వరాలను మరోసారి చంద్రబాబు నాయుడు అటకెక్కించే పరిస్థితి కనిపిస్తోంది. అబద్ధపు హామీలతో ప్రజలను మోసం చేయడంలో సిద్ధహస్తులైన టీడీపీ నాయకుల వలలో పడి ప్రజలు మరోసారి మోసపోయారు. గతంలో నాలుగేళ్ల పాటు నిరాటంకంగా అమ్మఒడి పథకం ద్వారా తల్లుల ఖాతాలకు జగన్ ప్రభుత్వం నేరుగా నగదు బదిలీ చేయగా ప్రస్తుత కూటమి ప్రభుత్వం అమ్మకు వందనం పథకం గురించి ఇంకా అధ్యయనం చేయాలని చెప్పడం పలాయన వాదమేనంటున్నారు. ఇలా బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారెంటీ పేరిట ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాల్లో ఏ ఒక్కదాన్నీ కూటమి ప్రభుత్వం ప్రారంభించలేకపోయింది.

– ఏలూరు (ఆర్ఆర్‌పేట)

సూపర్ సిక్స్

- యువతకు 20 లక్షల ఉద్యోగాలు / నెలకు రూ.3 వేల నిరుద్యోగ భృతి
- స్కూలుకి వెళ్లే ప్రతి విద్యార్థికి ఏడాదికి రూ.15,000
- ప్రతి రైతుకు ఏటా రూ.20 వేలు ఆర్థిక సాయం
- ప్రతి మహిళకి నెలకు రూ.1500 (19 సం॥ నుంచి 59 సం ॥ వరకు)
- ప్రతి ఇంటికి ఏడాదికి ఉచితంగా 3 గ్యాస్ సిలిండర్లు
- మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం

● సూపర్ సిక్స్ అంటూ ప్రజలను నిలువునా మోసం ● అతీగతీ లేని ఆరు పథకాలు ● ఎదురుచూపులే గతి..



ప్రతి మహిళకు నెలకు రూ.1500

ఏలూరు నియోజకవర్గంలో

అర్హులైన మహిళల సంఖ్య

95 వేల మంది

వీరికి నెలకు ఇవ్వాల్సిన సాయం

రూ.14.25 కోట్లు

జగన్ పాలనలో ఒక్కో ఏడాది రైతులకు అందిన సాయం

రైతు భరోసా లబ్ధి దారుల వివరాలు..

సంవత్సరం	లబ్ధిదారులు	లబ్ధి (రూ.కోట్లలో)
2019-20	2896	రూ.3.90 కోట్లు
2020-21	2915	రూ.3.93 కోట్లు
2021-22	2727	రూ.3.68 కోట్లు
2022-23	2623	రూ.3.54 కోట్లు
2023-24	2814	రూ.3.23 కోట్లు

జగన్ పాలనలో ఒక్కో ఏడాది తల్లులకు అందిన సాయం

అమ్మఒడి లబ్ధిదారుల వివరాలు..

సంవత్సరం	లబ్ధిదారులు	లబ్ధి(రూ.కోట్లలో)
2019-20	24,589	36.88 కోట్లు
2020-21	26,451	39.68 కోట్లు
2021-22	24,357	36.54 కోట్లు
2022-23	23,388	35.08 కోట్లు



టీడీపీ పాలనలో ఒక్కో రైతుకు అందాల్సిన సాయం

నియోజకవర్గం	లబ్ధి (కోట్లలో)
ఏలూరు	రూ.12.99 కోట్లు

6496

వేల మంది రైతులు




టీడీపీ పాలనలో ఒక్కో ఏడాది తల్లులకు అందాల్సిన సాయం

నియోజకవర్గం	లబ్ధి (కోట్లలో)
ఏలూరు	రూ. 67.16 కోట్లు

నియోజకవర్గంలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో

మొత్తం విద్యార్థులు 44,777



యువతకు నెలకు రూ.3 వేలు నిరుద్యోగ భృతి

ఏలూరు నియోజకవర్గంలో

అర్హులైన యువత

30 వేల మంది

వీరికి నెలకు ఇవ్వాల్సిన సాయం

రూ. 9 కోట్లు

ఫీజులు కట్టొచ్చని ఆశ పడ్డాం..



తల్లికి వందనం పథకం అమలైతే పిల్లల స్కూల్ ఫీజులు కట్టవచ్చని ఆశపడ్డాం. ఏటా జూన్, జూలై నెలల్లోనే స్కూల్ ఫీజులు చెల్లించాల్సి ఉంటుంది. కొత్త ప్రభుత్వం వచ్చి మా ఇద్దరు పిల్లలకి రూ.15 వేలు చొప్పున రూ.30 వేలు వస్తుందని లెక్కవేసుకున్నాను. కానీ ఇప్పటివరకూ ఈ పథకం అమలు చేయ లేదు.

– పోలిశెట్టి ఈశ్వరి, ప్రైవేట్ స్కూల్ టీచర్

అప్పులు చేయాల్సి వచ్చింది..



ప్రభుత్వ బడుల్లో చదువుతున్నా చదువు కోసం అనేక ఖర్చులు చేయాల్సి వస్తోంది. అవన్నీ తల్లికి వందనం సొమ్ము ఇస్తే తీర్చవచ్చని అనుకున్నాను. పిల్లల చదువుకు సంబంధించిన సామగ్రి కొనుగోలుకు అప్పులు చేయాల్సిన పరిస్థితి దాపురించింది.

– ముత్త హేమలత, గృహిణి

పెట్టుబడి సాయం అందించాలి



అన్నదాత సుఖీభవ పథకం కింద రైతులకు పెట్టుబడి సాయం రూ.20 వేలు తక్షణమే అందించాలి. కౌలు రైతులకు కూడా ఈ పథకాన్ని వర్తింపజేయాలి. భారీ వర్షాల వల్ల పంటలు దెబ్బతిన్న అన్నదాతలు తీవ్రంగా నష్టపోయారు. చాలా మంది రైతులకు ఇంకా ధాన్యం డబ్బులు అందలేదు.

– కె.శ్రీనివాస్, ఏపీ రైతు సంఘం ఏలూరు జిల్లా కార్యదర్శి

ఉద్యోగం ఇప్పించండి చాలు



ఉన్నత చదువులు చదివినా ఇప్పటి వరకూ ఉద్యోగం రాలేదు. ప్రతి చిన్న అవసరానికీ తల్లిదండ్రులపై ఆధారపడాల్సి రావడం బాధాకరంగా ఉంది. అర్హతల మేరకు ఏదో ఒక ఉద్యోగం ఇప్పించి పుణ్యం కట్టుకోండి. నెలకు రూ.3 వేలు ఇస్తే ఎవరిపైనా ఆధారపడకుండా నెట్టుకురావచ్చు.

– బి.వినోద్, నిరుద్యోగి

క్లుప్తంగా


పాఠశాల విద్యార్థులకు చేయూత



బాలబాలికలకు పరికరాలు అందిస్తున్న దాత, ఉపాధ్యాయులు

ఏలూరు రూరల్ : ఉన్నత విద్యకు పేదరికం ఎన్నడూ అడ్డుకాదని ట్రెస్ ఇండియా స్వచ్ఛంద సంస్థ చైర్మన్ దిడ్ల యాంజిలో అన్నారు. బుధవారం స్థానిక వైఎస్ఆర్ కాలనీ ప్రాథమిక పాఠశాల చిన్నారులు నెలరోజుల పాటు వాడుకునేందుకు అవసరమైన సబ్బు, కొబ్బరినూనె, పౌడర్, బ్రష్, పేస్ట్ తదితర వస్తువులను అందజేశారు. మొత్తంగా 113 మంది బాలలకు వస్తువులు అందించడంపై ఉపాధ్యాయులు జీజేఏ స్టీవెన్ సంతోషం వ్యక్తం చేశారు.

రైతు సంఘం జిల్లా అధ్యక్షుడిగా భాస్కరరావు



ఏలూరు (టూటౌన్): ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడిగా కట్టా భాస్కరరావు ఎన్నికయ్యారు. స్థానిక పవరుపేటలోని అన్నే భవన్‌లో రైతు సంఘం జిల్లా విస్తృత సమావేశంలో జిల్లా అధ్యక్ష ఎన్నిక నిర్వహించినట్టు ఆ సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ తెలిపారు. జిల్లాలో రైతాంగ సమస్యల పరిష్కారానికి రైతు సంఘం కృషి చేస్తుందని చెప్పారు. జిల్లా నూతనంగా అధ్యక్షుడు కట్టా భాస్కరరావు మాట్లాడుతూ అన్నిపంటల రైతాంగ సమస్యలపై ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం పనిచేస్తోందని, జిల్లాలో రైతు సంఘాన్ని బలోపేతం చేస్తామని తెలిపారు. సమావేశంలో రైతాంగ సమస్యలు చర్చించి పలు తీర్మానాలను ఆమోదించారు.

గురుకుల పాఠశాల బాలికల ప్రతిభ



ప్రతిభ కనబర్చిన వట్లూరు బాలికల గురుకుల పాఠశాల విద్యార్థినులతో ఉపాధ్యాయులు

ఏలూరు (టూటౌన్): అండర్ 19 జిల్లా స్థాయి 70వ ఆటల పోటీల్లో వట్లూరు గురుకుల పాఠశాల విద్యార్థులు తమ ప్రతిభ కనబర్చారు. జూడోలో ఆరుగురు, కరాటేలో ఆరుగురు, వెయిట్ లిఫ్టింగ్‌లో ఇద్దరు విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించారు. దీంతో ప్రిన్సిపాల్ దాసరి మేరీ ఝాన్సీ రాణి, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు. కళాశాల పీడీ తేళ్ల సునీల కుమారి, పీఈటీ జి.గీత వెంకట భవాని, అర్హత సాధించిన విద్యార్థులను ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు అభినందించారు.

నైతికంగా జీవించడమే నిజమైన స్వేచ్ఛ

ఏలూరు (ఆర్ఆర్‌పేట) : అనైతిక విధానాలతో జీవించి స్వేచ్ఛగా జీవిస్తున్నామనే భ్రమలో ప్రజలు ఉంటున్నారని జమాఅతే ఇస్లామీ హింద్ మహిళా విభాగం ఏలూరు నగర అధ్యక్షురాలు జుబేదా ఖతూన్ అన్నారు. 'నైతికతే నిజమైన స్వేచ్ఛ' దేశ వ్యాప్త ప్రచార ఉద్యమం ఈనెల ఒకటో తేదీ నుంచి 30వ తేదీ వరకు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా బుధవారం ఏలూరు తంగెళ్లమూడి నెహర్ మసీద్‌లోని జమా అతే కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. సంస్థ సభ్యురాలు పర్వీన్, గరల్స్ ఇస్లామిక్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా సభ్యురాలు సమీహా ముబీన్‌తో కలిసి ఉద్యమం వివరాలను వెల్లడించారు. భారతదేశంలో పాశ్చాత్య పోకడలతో నైతిక విలువలు పక్కనపెట్టి ఇష్టారాజ్యంగా జీవితం గడపడంతో నేరాలు అధికంగా జరుగుతున్నాయన్నారు. నైతిక విలువలపై అవగాహన కల్పించడానికి దేశవ్యాప్తంగా అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. నిజమైన స్వేచ్ఛ అంతర్లీనంగా నైతికతతో ముడిపడి ఉందన్నారు. స్వేచ్ఛ పోరాటంలో నైతికత లేకపోవడం అణచివేతకు, దౌర్జన్యానికి దారి తీస్తుందని వివరించారు. ఈ సందర్భంగా నైతిక విలువలపై ముద్రించిన కరపత్రం విడుదల చేశారు. సమావేశంలో జమాతే మహిళా సభ్యులు ఎస్‌కే రెహనా బేగం, వహీదా హుమేరబి ఎస్‌కే షిమ ఫాతిమా తదితరులు పాల్గొన్నారు.



నైతిక విలువలపై ముద్రించిన కరపత్రం విడుదల చేసిన ప్రతినిధులు

సీఆర్ఆర్ విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక సీఆర్ రెడ్డి కళాశాల చదువుతూ అత్యుత్తమ ప్రదర్శన చేసిన విద్యార్థులకు తమ ట్రస్ట్ ద్వారా స్కాలర్‌షిప్‌లు ఇవ్వాలని నిర్ణయించినట్లు దేశిరాజు సత్య సుబ్రహ్మణ్యం మెమోరియల్ ట్రస్ట్ వైస్ చైర్మన్ కొమ్మన రాధాకృష్ణ తెలిపారు. ఆ ట్రస్ట్ జనరల్ బాడీ సమావేశం బుధవారం స్థానిక సీఆర్ఆర్ కళాశాల ఆడిటోరియంలో నిర్వహించారు. సమావేశంలో రాష్ట్ర మాజీ డీజీపీ ఏబీ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ వడ్లపట్ల లక్ష్మీదేవి మెమోరియల్ ఎండోమెంట్ లెక్చర్ ద్వారా విద్యారంగంలో చేయాల్సిన కృషిని వివరించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ కార్యదర్శి పి.ఆంజనేయులు మాట్లాడుతూ సీఆర్ఆర్ కళాశాలలో ఫిజిక్స్ టాపర్లకు డీఎస్ సుబ్రహ్మణ్యం మెమోరియల్ ట్రస్ట్, జువాలజీ టాపర్లకు డాక్టర్ సక్కుబాయి పాతూరి రామచంద్రన్ మెమోరియల్, గణితం టాపర్లకు భోగరాజు సూర్య ప్రభావతి మెమోరియల్ సంస్థలచే స్కాలర్‌షిప్‌లు అందిస్తామని తెలిపారు. సమావేశంలో ట్రస్ట్ ప్రతినిధులు కానాల శ్రీనివాసరావు, ఎండీ మెహబూబ్ బాషా, సీఆర్ఆర్ విద్యా సంస్థల కార్యదర్శి ఎంబీఎస్‌వీ ప్రసాద్, జాయింట్ సెక్రటరీలు కొడాలి వెంకట సుబ్బారావు, వల్లభనేని శ్రీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఏబీ వెంకటేశ్వరరావు

ప్రతి వ్యక్తికీ సొంత ఇల్లు, భూమి ఉండాలి

ఏలూరు (టూటౌన్) : ప్రతి వ్యక్తీ గౌరవంగా బతకడానికి సొంతంగా ఇల్లు, భూమి ఉండాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఎస్‌కే హబీబ్ బాషా అన్నారు. స్థానిక నరసింహారావుపేటలోని లేడీస్ క్లబ్‌లో దళిత బహుజన రిసోర్స్ సెంటర్ జిల్లా కన్వీనర్ సింగవరపు జ్యోతి ఆధ్వర్యంలో ఎస్సీ, ఎస్టీ రైతులకు ప్రభుత్వ అధికారులకు ముఖాముఖీ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. కార్యక్రమంలో హబీబ్ బాషా మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీలకు ప్రత్యేకంగా ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్‌లో బడ్జెట్ ఉందని, జనరల్ బడ్జెట్లో వాటా ఉందని తెలిపారు. జిల్లా ఉద్యానశాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎస్ రామ్మోహన్ మాట్లాడుతూ ఎకరం నుంచి ఐదు ఎకరాల్లోపు ఉన్న కౌలు రైతులు, భూమి ఉన్న చిన్న రైతులకు సబ్సిడీ కింద వారికి అనుకూలమైన పంటలకు సబ్సిడీ ఇస్తుందన్నారు. ఏడేళ్లకు ఒకసారి డ్రిప్ అవకాశం కల్పిస్తున్నారని తెలిపారు. డ్వామా ప్లాంటేషన్ మేనేజర్ వెంకటలక్ష్మి మాట్లాడుతూ సూపర్ నేపియర్ రకం గడ్డి రెండున్నర ఎకరాల వరకు సబ్సిడీ రూపంలో ఉపాధి హామీ పథకం ద్వారా అందిస్తామన్నారు. మునగ, గులాబీ, మల్లె తోటలు, బంతి తోటకు సబ్సిడీ ఉందని తెలిపారు. కార్యక్రమంలో డీబీఆర్‌సీ మానిటరింగ్ అండ్ ట్రైనింగ్ కోఆర్డినేటర్ ఎం హేమలత, రీజనల్ కోఆర్డినేటర్ జామి రమాదేవి, డీబీఆర్‌సీ సిబ్బంది గోసాల రాణి, బలే సురేష్, ఎస్సీ, ఎస్టీ రైతులు పాల్గొన్నారు.



రైతులతో ముఖాముఖిలో మాట్లాడుతున్న హబీబ్ బాషా

21 నుంచి నవచైతన్యం సభలు, పోటీలు

ఏలూరు (టూటౌన్): మహనీయుల ఆశయాల బాటలో నవచైతన్యం పేరుతో ఈ నెల 21 నుంచి 29వ తేదీ వరకు సభలు, పోటీలు చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ఏవీఆర్ విజ్ఞాన కేంద్రం జిల్లా కార్యదర్శి గుడిపాటి నరసింహారావు తెలిపారు. ఏవీఆర్ విజ్ఞాన కేంద్రం, హేలాపురి బాలోత్సవం కమిటీల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు చెప్పారు. కార్యక్రమ కన్వీనర్లు కూచిపూడి సత్యనారాయణ, పి.ఆంజనేయులు ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ఈ మేరకు ఫ్లెక్సీలను విడుదల చేశారు. కార్యక్రమంలో బహుజన ఆఫీసర్స్ అండ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు దేవర కొండ వెంకటేశ్వరరావు, గుబ్బల నాగేశ్వరరావు, డి.దిలీప్ కుమార్, మేతర అజయ్ బాబు, కె.సోమ్లా నాయక్, ఎస్ రవి, డి.గణేష్,పెరియార్ పూలే, పి.సూర్య ప్రకాష్, సి.రవి, వై.నిర్మల, పి.రవీంద్రనాథ్, కె.జనని తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో సీసీఎస్ ఎస్సై మృతి



ఏలూరు టౌన్: స్థానిక సీసీఎస్ స్టేషన్ ఎస్సై డి.నరసింహారావు బుధవారం సాయంత్రం గుండెపోటుతో మృతిచెందారు. 1985 బ్యాచ్ కానిస్టేబుల్‌గా పోలీస్ శాఖలో విధుల్లో చేరిన ఆయన ఎస్సైగా పదోన్నతి పొందారు. కొంతకాలం క్రితం ఏలూరు రైల్వే ఎస్సైగా పనిచేశారు. రెండు నెలల క్రితం ఏలూరు సీసీఎస్‌కు బదిలీపై వచ్చారు.

బాలికలపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలి

ఏలూరు (టూటౌన్): స్థానిక అమీనాపేటలోని ప్రైవేట్ వసతి గృహంలోని బాలికలపై లైంగిక దాడులకు పాల్పడిన శశికుమార్‌ను వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని సీపీఎం ఏలూరు నగర కార్యదర్శి పి.కిషోర్ డిమాండ్ చేశారు. స్థానిక పవరుపేటలోని సీపీఎం కార్యాలయంలో బుధవారం నిర్వహించిన నగర కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. వెంటనే జిల్లా ఉన్నతాధికారులు ఈ ఘటనపై సమగ్ర దర్యాప్తు చేపట్టాలని, వసతి గృహంలో ఉన్న బాలికలను ప్రభుత్వ హాస్టల్స్, పిల్లలకు తగిన రక్షణ కల్పించాలని కిషోర్ డిమాండ్ చేశారు.

శశికుమార్‌ను అరెస్టు చేయాలి

శ్రీ స్వామి దయానంద సరస్వతి సేవాశ్రమం పేరుతో నిర్వహిస్తున్న బాలికల వసతి గృహంలో బాలికలపై లైంగిక దాడికి పాల్పడిన శశికుమార్‌ను అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా బాలల హక్కుల పరిరక్షణ సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి నేతల రమేష్ బాబు డిమాండ్ చేశారు. బాలికల విద్యాభ్యాసానికి ఆటంకం కలగకుండా ఆ వసతి గృహంలో చదువుకుంటున్న విద్యార్థినులను ప్రభుత్వ బాలికల వసతి గృహంలో ఉండి వారు చదువులు కొనసాగించేలా ప్రభుత్వ ఉన్నతాధికారులు తగుచర్యలు తీసుకోవాలని కోరారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక శనివారపుపేట సబ్ స్టేషన్ మరమ్మతుల నిమిత్తం ఈ నెల 20న శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ఈఈ జేపీబీ నటరాజన్ ఒక ప్రకటనలో తెలిపారు. శనివారపు పేట, శ్రీరాంనగర్, విద్యానగర్ శాతవాహన నగర్, దొండపాడు, న్యూ అశోక్ నగర్, దుగ్గిరాల ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

వరద బాధితులకు మహిళల భారీ విరాళం

ఏలూరు (టూటౌన్): వరద బాధిత కుటుంబాలకు అండగా నిలబడుతూ పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) ఆధ్వర్యంలో భారీ రిలీఫ్ ఫండ్‌ను బుధవారం ఎమ్మెల్యే బడేటి చంటికి మహిళలు అందజేశారు. స్వయం సహాయక సంఘ సభ్యుల ద్వారా గ్రూపుకు రూ.100 చొప్పున మెప్మా విభాగం విరాళాలు సేకరించింది. ఏలూరులో ఉన్న 4,500 మెప్మా సంఘాలకు గాను ఒక్కో సంఘానికి రూ.100 చొప్పున వసూలైన రూ.4.50 లక్షలను ముఖ్యమంత్రి సహాయ నిధికి ఎమ్మెల్యే చంటి, నగర మేయర్ షేక్ నూర్జహాన్ చేతుల మీదుగా మహిళలు అందజేశారు. పీఓ కృష్ణమూర్తి, మెప్మా సిటీ మిషన్ మేనేజర్ కె.సుధాకర్ రావు, మెప్మా సీఓలు, ఆర్‌పీలు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

వర్క్ ఎడ్జెస్ట్‌మెంట్‌లో రాజకీయ జోక్యంతో అన్యాయం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): జిల్లా విద్యాశాఖలో ఇటీవల నిర్వహించిన వర్క్ ఎడ్జెస్ట్‌మెంట్ ప్రక్రియలో రాజకీయ నాయకుల జోక్యంతో జూనియర్ ఉపాధ్యాయులు, ఎంటీఎస్ ఉపాధ్యాయులకు తీరని నష్టం ఏర్పడిందని వైఎస్సార్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గెడ్డం సుధీర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ హయాంలో ఆ పార్టీ నాయకుల అండదండలతో డీడీఓ పరిధిలో కాకుండా వారికి నచ్చిన చోట పని చేశారని, ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో ఆ నాయకులను కూడా ఉపయోగించుకుని వారికి కావల్సిన ప్రాంతానికి డిప్యూటేషన్ వేయించుకొన్నారని తెలిపారు. వారు వెళ్లాల్సిన ప్రాంతంలో, వారు పని చేయాల్సిన ప్రాంతంలో వేస్తున్నట్టుగా టెక్నికల్‌గా డీఈఓ ఆఫీస్ సిబ్బందితో మేనేజ్ చేసి జీతం కూడా అదే స్కూల్‌లో తీసుకోవడం చాలా అన్యాయమని వివరించారు. ఇటువంటి వారిపై చర్యలు తీసుకుని వెంటనే వెనుకకు పంపించాలని డిమాండ్ చేశారు.

వార్డెన్ భర్తపై చర్యలు తీసుకోవాలి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక అమీనా పేటలోని దయానంద సరస్వతి సేవాశ్రమంలో చదువుకుంటున్న విద్యార్థినుల పట్ల హాస్టల్ వార్డెన్ ఫణిశ్రీ భర్త శశి కుమార్‌పై కఠినమైన చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు కాకి నాని ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. అతనికి సహకరించిన హాస్టల్ వార్డెన్ ఫణిశ్రీని సస్పెండ్ చేయాలని పేర్కొన్నారు. విద్యార్థులకు పూర్తిగా రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు.

ఎన్ఎంఎంఎస్ పరీక్ష దరఖాస్తులకు 24 వరకు గడువు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఈ విద్యా సంవత్సరం నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్) పరీక్షకు దరఖాస్తు చేసుకోవడానికి ఈ నెల 24 తేదీ వరకు గడువు పొడిగించినట్టు జిల్లా విద్యాశాఖాధికారి ఎస్ అబ్రహం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో 8వ తరగతి చదువుతూ కుటుంబ సంవత్సర ఆదాయం రూ. 3.50 లక్షల లోపు ఉన్న విద్యార్థులు మాత్రమే అర్హులన్నారు. ఈ పరీక్ష డిసెంబర్ 8న నిర్వహిస్తారని, పరీక్ష రుసుము ఓసీ, బీసీ విద్యార్థులు రూ.100, ఎస్సీ,ఎస్టీ విద్యార్థులు రూ. 50 చెల్లించి దరఖాస్తులను ఆన్‌లైన్‌లో సమర్పించాలని పేర్కొన్నారు.

వంట నూనె దుకాణాలపై దాడులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఏలూరు రీజినల్ విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి వి.శ్రీరాంబాబు నగరంలోని పలు వంట నూనెల దుకాణాలపై బుధవారం రెండో రోజూ దాడులు కొనసాగించారు. కొల్లవారి వీధిలోని విజయ లక్ష్మి జనరల్ స్టోర్స్, భగత్ సింగ్ సెంటర్‌లోని శివ కృష్ణ జనరల్ స్టోర్స్, అమీనాపేటలోని ఎస్‌వీఆర్ జనరల్ స్టోర్స్‌లలో వంట నూనెలను గరిష్ట చిల్లర ధర కంటే ఎక్కువ ధరకు అమ్ముతున్నట్టు గుర్తించామని అధికారులు తెలిపారు. అధిక ధరలకు అమ్ముతున్న ఈ మూడు షాపులపై తూనికల కొలతల అధికారులు కేసు నమోదు చేశారని చెప్పారు.

కాలువలో పడి బాలుడి మృతి

ఏలూరు టౌన్: సరదాగా ఆడుకుంటూ ప్రమాదవశాత్తు కాలువలో పడి బాలుడు మృతి చెందాడు. ఏలూరు గ్లేవియర్ నగర్‌కు చెందిన శనగవరపు రామకృష్ణ ఏలూరులోని ఒక హోటల్లో వంట మేస్త్రిగా పని చేస్తున్నాడు. అతని కుమారుడు బాల విఘ్నేష్ 6వ తరగతి చదువుతున్నాడు. బుధవారం సోదరితో కలిసి ఇంటి సమీపంలో ఉన్న తమ్మిలేరు కాలువ వద్ద ఆడుకుంటూ కాలువలోకి దిగారు. ప్రమాదవశాత్తు వారు మునిగిపోతుండగా స్థానికులు రక్షించారు. బాలుడిని వెంటనే ఏలూరు జీజీహెచ్‌కు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.



మృతి చెందిన విఘ్నేష్

ట్రాఫిక్ లేకుండా చూడాలి

ఏలూరు(మెట్రో): జిల్లాలో ప్రజల భాగస్వామ్యంతో జరిగే అవగాహన కార్యక్రమాలు, ర్యాలీలు, మారథాన్, వంటి కార్యక్రమాల నిర్వహణలో ఆ ప్రాంతంలోని ప్రజలకు ట్రాఫిక్ సమస్యలు లేకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి వివిధ శాఖల జిల్లా అధికారులను ఆదేశించారు. బహిరంగ ప్రదేశాలలో నిర్వహించే ర్యాలీలు, అవగాహన వంటి కార్యక్రమాల కారణంగా ప్రజలకు అసౌకర్యం కలగకుండా ఆయా కార్యక్రమాల వివరాలను ముందుగానే పోలీసు అధికారులకు తెలియజేసి సమన్వయంతో ట్రాఫిక్ మళ్లింపు వంటి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.